క్లుప్తంగా

శ్రీవారి అధ్యయనోత్సవాలు ప్రారంభం



శ్రీవారికి పూజ చేస్తున్న అర్చకులు, ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి అధ్యయనోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దివ్య ప్రభంద పారాయణ చేసి తిరువాయి మొజి, శాత్తుమొర్రై నిర్వహించి, మంగళాశాసనాలు పలికి తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ట్రస్టీబోర్డు ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ముగ్గురిపై కేసు

ఏలూరు టౌన్: మహిళపై దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఏలూరు ఎన్‌ఆర్‌పేటలో ఉంటున్న బంకూరి శశికళ ఇంటి ఆవరణలోకి పక్కనే ఉన్న బత్తుల వీరవెంకట సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో వాడిన మురుగునీరు వస్తోంది. దీనిపై శశికళ ఈ నెల 1వ తేదీ రాత్రి ప్రశ్నించగా, వెంటనే సత్యనారాయణ భార్య రుద్రవేణి, కుమార్తె సంధ్య కలిసి దాడి చేశారు. గాయపడిన శశికళ ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరింది. ఆ ముగ్గురుపై త్రీటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడు ప్రాంతంలో ఒక మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సత్రంపాడుకు చెందిన ఆమె అక్రమంగా మద్యం విక్రయిస్తుందనే సమాచారంతో నెహ్రూ కాలనీ వద్ద పోలీసులు తనిఖీ చేపట్టారు. అదే ప్రాంతంలో మద్యం విక్రయిస్తుండగా ఆమెను పట్టుకున్నారు. ఆమె నుంచి మూడు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

పింఛన్‌తో పేదలకు ఆర్థిక భరోసా



ఆసుపత్రిలో నాగరాజుకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ జయకుమార్



తెనాలిలో మహబూబ్ బీకు పింఛన్ అందచేస్తున్న నాగూర్, మస్తాన్ వలీ

ఏలూరు టౌన్: నేను ఉన్నాను.. నేను విన్నాను.. అని భరోసా ఇచ్చిన జగనన్న పేదలకు పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ప్రతి నెలా ఠంచన్‌గా పింఛన్ అందిస్తూ ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనారోగ్యంతో బాధపడేవారి బాగోగులు చూసుకుంటూ.. వారు ఎక్కడ ఉన్నా పింఛన్‌ను అందించడంతో వారిలో ఆనందం వెల్లువిరుస్తోంది. ఆరోగ్య క్షీణించి మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న ఏలూరు తంగెళ్లమూడి యాదవనగర్‌కు చెందిన అంగిరేకుల నాగరాజుకు యాదవనగర్–3వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ పండుల జయకుమార్ సోమవారం పింఛన్ అందజేశారు. ఇప్పుడున్న పరిస్థితిలో పింఛన్ సొమ్ము తనకు ఆసరాగా నిలుస్తుందని, మంగళగిరి ఆసుపత్రికి వచ్చి పింఛన్ ఇవ్వడం సంతోషంగా ఉందని నాగరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తెనాలిలో తన కుమార్తె వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఏలూరు 47వ డివిజన్ తంగెళ్లమూడి జెండా చెట్టు ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ బీకి ఏలూరు 10వ సచివాలయానికి చెందిన వాలంటీర్లు షేక్ నాగూర్, మహ్మద్ సుల్తాన్ మస్తాన్ వలీ తెనాలి వెళ్లి పెన్షన్ సొమ్ము, ఆరోగ్యశ్రీ కార్డును అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తమలాంటి పేదలకు పెన్షన్ సొమ్ము ఖర్చులకు ఉపయోగపడు తుందని మహబూబ్ బీ సంతోషం వ్యక్తం చేశారు.

9న నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

ఎన్‌డీడీ వాల్‌పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్



ఎన్‌డీడీ వాల్‌పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సరం సందర్భంగా ఈనెల 9న మాత్రలు పంపిణీ చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ ఎన్‌డీడీ కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు వారందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపం లేకుండా చూడోచ్చని చెప్పారు. ఈనెల 9న మాత్రలు తీసుకోని వారికి, 16వ తేదీన మాత్రలు వేయిస్తామని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 4,00,533 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. డీఎంహెచ్‌ఓ షర్మిష్ట మాట్లాడుతూ ఏటా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని, ఏడాది నుంచి రెండేళ్ల పిల్లలకు 200 ఎంజీ మాత్ర, ఆపై 19 ఏళ్ల వయస్సు వరకు 400 ఎంజీ మాత్ర ఇస్తామని చెప్పారు. భోజనం చేసిన తర్వాత ఈ మాత్ర వేసుకోవాలన్నారు. జ్వరం, ఏ ఇతర అనారోగ్యంగా ఉన్నా ఈ మాత్ర వేయకూడదని హెచ్చరించారు. జిల్లాలో గుర్తించిన 4,00,533 మందిలో అంగన్‌వాడీ పిల్లలు 71,295 మంది, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 2,89,953, ప్రైవేటు, ప్రభుత్వ ఇంటర్ విద్యార్థులు 35,045, ఏడబ్ల్యూసీ విద్యార్థులు 4240 మంది ఉన్నారని, వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.పుష్పమణి, జెడ్పీ సీఈఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, డీఈఓ శ్యామ్ సుందర్, డీఆర్‌డీఏ పీడీ డా. ఆర్.విజయరాజు, ఆర్డీఓ ఎన్‌ఎస్‌కె ఖాజావలి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ డి.పాల్ సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపే వారు రోడ్డు సైన్లు, ట్రాఫిక్ లైట్లు అనుసరించడంతో పాటు ఒకే లైనును అనుసరించాలని ప్రసాద్ సూచించారు. అవసరమైనప్పుడు ఇండికేటర్ని వినియోగించాలని, ఎల్, బేబీ ఆన్ బోర్డు వంటి సైన్ల వల్ల మరింత జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడానికి దోహదపడతాయన్నారు. జీబ్రా క్రాసింగ్‌ల వద్ద మాత్రమే రోడ్డు దాటాలని, ప్రాణ రక్షణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ఉపయోగించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ఎంవీఐ జి.ప్రసాదరావు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

గణపవరం: రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే వాసుబాబు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన సీఎంను కలిసి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన వివరించారు. బువ్వనపల్లి, అడవికొలను, అర్ధవరం, చేబ్రోలు, దూబచర్ల తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల నిర్మాణానికి ఇటీవల సుమారు రూ.10 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఆయా రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. గణపవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పురోగతిని ముఖ్యమంత్రికి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

త్రీటౌన్ ఎస్సైగా ఫణీంద్ర



సీఐ వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సై ఫణీంద్ర

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.ఫణీంద్ర నియమితులయ్యారు. ఆయన సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా సీఐ వి.వెంకటేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2012 ఎస్సై బ్యాచ్‌కు చెందిన ఫణీంద్ర గతంలో ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేశారు. అనంతరం కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన కృష్ణా జిల్లా విజయవాడ గవర్నర్ పేట నుంచి బదిలీపై వచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణతోపాటు నేరాల అదుపుకు కృషి చేస్తానని ఫణీంద్ర చెప్పారు. త్రీటౌన్ పోలీస్ సిబ్బంది ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

దళిత ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలి



దళిత ఆదివాసి మ్యానిఫెస్టో ఆవిష్కరించిన నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దళిత ఆదివాసీల అభివృద్ధికి దళిత సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ దళిత ఆదివాసి మ్యానిఫెస్టో 2024 పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్రస్థాయి నాయకులు, మేధావుల నుంచి దళిత ఆదివాసీల జీవన స్థితిగతులు, వారి ఆర్థిక అభివృద్ధికి అనుగుణంగా 10 ముఖ్యమైన అంశాలతో మ్యానిఫెస్టో రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ సిబ్బంది సింగవరపు జ్యోతి, గోసాల ఝాన్సీరాణి, బలే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేసిన దృశ్యం

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమంలో సోమవారం ఉంగుటూరు మండలం కొక్కరమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు యడవల్లి ఏడుకొండలు తనకు ట్రై సైకిల్ ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి పి.రాకాడ మహిని ట్రై సైకిల్‌ను స్పందన కార్యక్రమానికి తెప్పించారు. ట్రై సైకిల్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో ఏడుకొండలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ట్రై సైకిల్ లేక ప్రయాణానికి ఎన్నో వ్యయప్రయాసాలకు గురయ్యానని, జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా తనకు ట్రై సైకిల్ తక్షణమే అందించడం పట్ల జిల్లా కలెక్టర్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి, సంతోషం వ్యక్తం చేశాడు.

తహసీల్దార్లు, ఎంపీడీఓలు బాధ్యతల స్వీకరణ

భీమడోలు: భీమడోలు తహసీల్దార్‌గా జి.వరహాలయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల నేపథ్యంలో కాకినాడ ఆర్‌డీఓ కార్యాలయం ఏఓగా పని చేస్తూ బదిలీపై భీమడోలు తహసీల్దార్‌గా నియమించారు. ఈ తరుణంలో ఆయన భీమడోలు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొవ్వూరు, మైలవరం, గుడివాడ తహసీల్దార్‌గా పని చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని కాకినాడ ఆర్‌డీఓ ఏఓగా పని చేస్తున్న ఆయనను భీమడోలుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను తమ సిబ్బంది సహాయ సహకారాలతో నిష్పక్షపాతంగా నిర్వహిస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. అనంతరం ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసి ఏలూరు కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లిన ఎం.ఇందిరాగాంధీని వీఆర్వోలు, వీఆర్‌ఏ, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీటీ షంషూద్దీన్, సీఎస్‌డీటీ మాధవరావు, సర్వేయర్ ధర్మారావు, ఆర్‌ఐ కిరణ్మయి, వీఆర్వోల అసోసియేషన్ అధ్యక్షుడు కందులపాటి శంకర్, వీఆర్వోలు వినయ్, ఇంతియాఫ్, డి.సింహాచలం, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

దెందులూరు తహసీల్దార్‌గా జితేంద్ర

దెందులూరు: దెందులూరు తహసీల్దార్‌గా వి.జితేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఏపీ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ, అన్ని గ్రామాల వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. తహసీల్దార్ జితేంద్ర తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నుంచి బదిలీపై వచ్చారు.

తహసీల్దార్ నాంచారయ్యకు ఘన సత్కారం

దెందులూరు: దెందులూరు తహసీల్దార్‌గా విశేష సేవలందించిన ఎన్‌వీ నాంచారయ్య డిప్యూటీ కలెక్టర్‌గా ఏలూరు జిల్లాకు రావాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న నాంచారయ్యకు వీఆర్‌ఓలు, అన్ని గ్రామాల సర్వేయర్లు, రేషన్ డీలర్లు, వీఆర్‌ఏలు, రేషన్‌వాహనాల డ్రైవర్లు ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు కిషోర్, రామారావు, శ్రీనివాస్, అనిరుధ్, రామకృష్ణ, శ్రీనివాసరావు మాట్లాడుతూ తహసీల్దార్ నాంచారయ్య సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత నాంచారయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో దెందులూరు మండలంలో తనకు అందరూ సహకరించారని, ఉన్నతాధికారులు ప్రోత్సహించారని అన్నారు.

ఉంగుటూరు ఎంపీడీఓగా శర్మ

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంపీడీఓగా డీవీఎస్ శర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలు ఎంపీడీఓగా ఆయన పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆఫీసు సూపరింటెండెంటు ఆంజనేయబాబు, సీనియర్ సహాయకుడు ఫణి ఆయనకు స్వాగతం పలికారు. ఎంపీటీసీ సభ్యులు ఆయనన్ని కలిశారు.

భీమడోలు ఎంపీడీఓగా స్వర్ణలత

భీమడోలు: భీమడోలు ఎంపీడీఓగా టి.స్వర్ణలత సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీఓల బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా తోట్లవల్లూరు ఎంపీడీఓగా పని చేస్తున్న తుంగల స్వర్ణలతను భీమడోలు మండలానికి నియమించారు. ఈ నేపథ్యంలో ఆమె తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన సీహెచ్ పద్మావతిదేవి కృష్ణాజిల్లా ముసునూరు మండలం ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, గ్రామకార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

నిడమర్రు తహసీల్దారుగా పోసిబాబు

నిడమర్రు: నిడమర్రు తహసీల్దారుగా కె. పోసిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకూ తూర్పుగోదారి జిల్లా బిక్కవోలు మండల తహసీల్దారుగా విధులు నిర్వహించి బదిలీపై నిడమర్రు మండలం వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయం సిబ్బంది డీటీ శేఖర్, ఆర్‌ఐ సుబ్బారావు, వీఆర్వో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి. సాయి తదితరులు ఉన్నారు.

పెదపాడు తహసీల్దార్‌గా భావన్నారాయణ

పెదపాడు: పెదపాడు తహసీల్దార్‌గా భావన్నారాయణ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నందివాడ నుంచి బదిలీపై ఆయన పెదపాడు వచ్చారు. ఇంతకుముందు తహసీల్దార్‌గా పనిచేసిన జి.విజయకుమార్‌రాజు నందివాడ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. మండలంలోని వీఆర్వోలంతా మర్యాదపూర్వకంగా తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగప్రాప్తిరస్తు

- ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ ప్రాధాన్యం
- నైపుణ్యాలకు పదును
- జాబ్‌మేళాల ద్వారా అవకాశాలు
- 4,572 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

ఆకివీడు: నైపుణ్యంపైనే ఉద్యోగావకాశాలు ఆధారపడి ఉంటాయి. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న రోజుల్లో నైపుణ్యాల పాత్ర కీలకంగా మారింది. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలకు నైపుణ్యాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిరుద్యోగుల నైపుణ్యాలకు పదునుపెట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్‌హబ్‌లు ఏర్పాటుచేసి పలు రంగాల్లో యువతకు శిక్షణ ఇస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ముమ్మరంగా జాబ్‌మేళాలు ఏర్పాటుచేసి బాసటగా నిలుస్తోంది. జాబ్‌మేళాలకు నిరుద్యోగులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ఆయా కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొని ఉద్యోగాన్ని సంపాదిస్తున్నారు.

16,333 మంది హాజరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమాల్లో 16,333 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చాటిన 4,572 మందికి ఉద్యోగాలు వచ్చా యి. అలాగే క్యాంపస్ సెలెక్షన్స్‌లో మరో 1,361 మందికి పైగా విద్యార్థులు కొలువులు సాధించారు.

స్కిల్ హబ్‌లతో ఉపాధి, ఉద్యోగం

ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్ హబ్‌లను ఏర్పాటుచేసి యువతకు సాంకేతిక రంగంలో శిక్షణ ఇస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో 1 హబ్‌లను ఏర్పాటు చేసి ఎలక్ట్రానిక్, ఏసీ మెకానిజం, జూనియర్ సాఫ్ట్‌వేర్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. ఏడాది కాలంగా ఆయా హబ్‌ల ద్వారా సుమారు 2,400 మంది పలు కోర్సుల్లో శిక్షణ పొందగా.. పలువురికి ఉద్యోగావాకాశాలు కూడా కల్పించింది.

స్కిల్‌ను కిల్ చేసిన చంద్రబాబు

స్కిల్ డెవలప్‌మెంట్‌ను గత చంద్రబాబు ప్ర భుత్వం తుంగలో తొక్కింది. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దూరం చేసింది. జాబ్ మేళాల ఊసెత్తలేదు. దీంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. అయితే సీఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి జాబ్‌మేళాలు, క్యాంపస్ సెలెక్షన్స్ ద్వారా యువతకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

జాబ్ మేళాలు.. ఉద్యోగాలు పొందిన వారి వివరాలు

పశ్చిమగోదావరి జిల్లా

నియోజకవర్గం	హాజరైన వారు	ఎంపికైన వారు
నరసాపురం	886	297
తాడేపల్లిగూడెం	1,828	595
భీమవరం	2,676	569
ఆచంట	812	254
ఉండి	457	195
పాలకొల్లు	492	214
తణుకు	790	257

ఏలూరు జిల్లా

నియోజకవర్గం	హాజరైన వారు	ఎంపికైన వారు
నూజివీడు	703	258
ఏలూరు	2,126	539
పోలవరం	646	187
చింతలపూడి	645	276
ఉంగుటూరు	400	125
దెందులూరు	3,100	581
కైకలూరు	772	225

జాబ్‌మేళాలతో మేలు



నాలుగేళ్లుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన జాబ్ మేళాలు నిరు ద్యోగులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. యువత ఉత్సాహంగా జాబ్‌మేళాలకు హాజరయ్యారు. పేర్గాంచిన కంపెనీల్లో 4,572 మంది ఉద్యోగ అవకాశాలు పొందారు.

– ఎ.కృష్ణారెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి, భీమవరం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా..



జాబ్‌మేళా వేదికగా విప్రో కంపెనీ (చెన్నై)లో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం వర్కు ఫ్రమ్ హోంగా ఉద్యోగం చేస్తున్నాను. నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్‌మేళా నాకు ఎంతగానో ఉపయోగపడింది. సాఫ్ట్‌వేర్ కొలువును సాధించి పెట్టింది.

–హరీష్, బీఎస్సీ, పెనుగొండ

బీకాంతో ఉద్యోగం



బీకాం చదివి ఏ ఉద్యోగం పొందాలో తెలియలేదు. పట్టుదలతో చదివి జాబ్‌మేళాలో ఉద్యోగం సాధించాను. పేద కుటుంబంలో పుట్టిన నాకు రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం భీమవరంలో పనిచేస్తున్నాను.

– అంగర వసంతలక్ష్మి, బొండాడ, కాళ్ల మండలం